క్లుప్తంగా

ఆగమోక్తంగా మృత్యుంజయ స్వామికి పూజలు



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ జలం, పసుపు, కుంకుమ, విభూదితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



కార్మికులను పరీక్షిస్తున్న డాక్టర్ సురేష్

సత్యవేడు: నిత్యం విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య పరీక్ష లు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరా రు. సోమవారం కమ్యూనిటీ వైద్యశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వైద్యశాల పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు టి.సుబ్రమణ్యం, ఎంఈఓ కె.రవి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్లు విద్యాసాగర్, సో హైల్, మానస, హెడ్ నర్సు రమాదేవి, ఫార్మాసిస్టు దివ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సునీల్ కుమార్

నాగలాపురం: ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని స్థానిక ఎస్ఐ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. బజారు వీధిలో టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, బుక్ షాపులు వద్ద రోడ్డుపైనే నిలబెట్టి తాత్కాలిక ఫ్లెక్సీ బోర్డులతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని ఆయన అన్నారు. అంతే కాకుండా వ్యాపారస్తులు షాపులకు వచ్చే వినియోగదారుల ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పైనే పార్కింగ్ చేయనీయకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. లేకుంటే జరిమానా వేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే చర్యలు తప్పవన్నారు. వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని అన్నారు.

ముక్కంటి ఆలయ ఈవోగా చంద్రశేఖర్ ఆజాద్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఎఫ్ఏసీ ఈవోగా తిరుపతి ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను వేదపండితులు ఆశీర్వదించారు.

25న సహకార పరపతి సంఘ సమావేశం

నాగలాపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ వారు 25వ తేదీ మహాజన సభ నిర్వహించనున్నట్టు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఓ.రాధాకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో గత మహాజన సభలో ఆమోదించిన తీర్మానాలను ధ్రువీకరించడం, 2023-24వ సంవత్సరపు వార్షిక పరిపాలన బడ్జెట్ అంచనాలు తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రేణిగుంట: కరకంబాడి పంచాయతీ తారకరామానగర్ సమీపంలో సోమవారం రాత్రి రైలు పట్టాలను దాటుతూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. తారకరామానగర్‌కు చెందిన వి.హరి (40) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా రైలు పట్టాలను దాటే క్రమంలో రైలు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రైలు పట్టాల మధ్య పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రేణిగుంట జీఆర్‌పీ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు.

నేటి నుండి గ్రామ సభలు

నారాయణవనం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు సలహాలు, సూచనలు అందివ్వడానికి మంగళవారం నుండి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శోభారాణి తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో పొలాలను సందర్శించి సాగు చేసే పంటలను పరిశీలించి, రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆరూరు రోడ్డు గుంతలో చేరిన వర్షపు నీరు



గురుకుల పాఠశాల సమీపంలో గుంతల మయం



నరకప్రాయం.. ఈ ప్రయాణం

- అధ్వానంగా ఆరూరు రోడ్డు
- సత్యవేడు రోడ్లకు మోక్షం కలిగేనా..



తారు లేచిపోయి మట్టిరోడ్డును తలపిస్తున్న కన్నావరం-టీపీకోట రోడ్డు

సత్యవేడు: మండలంలోని రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. ఏ వాహనంలోనైనా అర్ధగంట ప్రయాణం గంట పడుతోందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆరూరు-మాదరపాకంరోడ్డు, సత్యవేడు- ఊత్తుకోట రోడ్డు, సత్యవేడు-టీపీకోట రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రోజూ ఈ మార్గాల్లో నరకం అనుభవిస్తున్నారు. మండలంలోని ఆరూరు-మాదరపాకం రోడ్డు అడుగుకో గుంత.. గజానికో గొయ్యితో దుస్థితికి చేరుకుంది. ప్రధానంగా శ్రీసిటీలో పనిచేస్తున్న తమిళనాడుకు చెందిన కార్మికులు ఈ మార్గంలో పలు కంపెనీలకు ద్విచక్ర వాహనాలపై ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చిపోతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కార్మికులు కొందరు సూళ్లూరుపేటలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతులతో ఆర్డీఓకు సమస్యను విన్నవించారు. మాదరపాకం -ఆరూరు రోడ్డును పరిశీలించాలని ఆర్డీఓ పంచాయతీ రాజ్ ప్రాజెక్టు ఏఈ ప్రకాష్‌రెడ్డికి సూచించారు. గుంతల మయంగా దుస్థితికి చేరిన రోడ్డును రెండు నెలల క్రితం ఏఈ పరిశీలించారు. మరమ్మతులకు రూ. 64 లక్షలు ఎస్టిమేషన్ వేశారు. ఇప్పటి వరకు పనులు చేపట్టక పోవడంతో నిధులు ఎప్పుడు మంజూరు అవుతాయో, పనులు ఎప్పుడు నిర్వహిస్తారో సత్యవేడు రోడ్లకు మోక్షమెన్నడో ..అని వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

15000 మందికి పైగా కార్మికులు

దుస్థితికి చేరిన ఈ మార్గంలో కన్నంబాకం, నాయుడుకుప్పం, ఏడూరు, గుంపిలి, పల్లెవాడ, మాదరపాకం, పాదిరివేడు, వానెల్లూరు, నెమళ్లూరు, తానిపూడి, పూలంబేడుకు చెందిన కార్మికులు 15000 మందికి ద్విచక్ర వాహనాల్లో నిత్యం శ్రీసిటీలోని కంపెనీలకు వచ్చి పోతున్నారు. ఎపుడు గోతులు పూడ్చి రోడ్డును బాగు చేస్తారో అని ఎదురు చూస్తున్నారు. ఇదే మార్గంలో సత్యవేడు ఆర్టీసీ బస్సులు సూళ్లూరుపేట-సత్యవేడు మార్గంలో తిరుగుతున్నాయి. రోడ్లు సరిగా లేకపోవడంతో అర్ధగంట ప్రయాణం గంట అయ్యేలా నెమ్మదిగా ఆర్టీసీ సర్వీసులు ప్రయాణిస్తున్నాయి.

ఆదమరిస్తే ఆపదే..

సత్యవేడు- ఊత్తుకోట మార్గంలో ఆదమరిస్తే ఆపద ముంచుకొచ్చేలా గుంతల మారిది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కంకర లేచిపోయి గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ గుంతల్లోకి వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ఆరు నెలల ముందు దాసుకుప్పం-సత్యవేడు రోడ్డులో ఏర్పడిన గుంతలు పూడ్చి, రోడ్డు ఆధునీకరణకు రూ.4.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టరు, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయక పోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

గుంతల రోడ్డు

సత్యవేడు పంచాయతీలోని నేతాజీ రోడ్డులో సిమెంటు లేచిపోయి గోతులు పడ్డాయి. ద్విచక్ర వాహనాల్లో వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలోనే ఎమ్మెల్యే సత్యవేడు, వరదయ్యపాళెం వెళ్లి వస్తున్నారు. అప్పడప్పుడు గోతిలో కంకర మట్టి పోసి మమ అనిపిస్తున్నారు. నిత్యం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోని వృథా నీరు రోడ్డుపై చేరి గుంతలో నిలుస్తోంది. దూరప్రాంతాలకు పోయే వారు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణం ఆలస్యం



ఆరూరు-మాదరపాకం రోడ్డులో అధికంగా గుంతలు తేలి వర్షపు నీటితో నిండి ఉండడంతో అర్ధగంట ప్రయాణం గంట పట్టే టట్టు ఉంది. శ్రీసిటీ సిబ్బందికి, ఆరూరు ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డును పునర్నిర్మించి, రోడ్డు వసతి మెరుగు పరచాలి.

- శేఖర్, మాజీ సర్పంచ్, ఆరూరు

ఆదమరిస్తే ప్రమాదమే..



సత్యవేడు-దాసుకుప్పం రోడ్డులో ద్విచక్ర వాహనదారులు ఆదమరిచి వాహనం నడిపితే ప్రమాదం బారిన పడక తప్పదు. రాత్రి పూట ఈ మార్గంలో ప్రయాణం దుర్భరంగా ఉంటోంది. ఎదురుగా వస్తున్న బస్సులు, లారీలు వెలుతురుతో రోడ్డు గుంతలు స్పష్టంగా కనిపించడం లేదు. దీంతో ఇబ్బందుల పాలవుతున్నాం. కనీసం గుంతలు పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

- యుగంధర్, కాదిరివేడు

జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్ల నిరసన



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు



గ్రీన్ అంబాసిడర్లకు రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలోని గ్రీన్ అంబాసిడర్లు సోమవారం జీతాల కోసం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా జీతాలు ఇవ్వడం లేదని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుడు కత్తిధర్మయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 680 విడుదల చేసి 18 నెలలు గడిచినా ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా పారిశుద్ధ్య పనులను చేశామని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేల జీతాన్ని ప్రతి నెలా ఇవ్వాలని, పెండింగ్ జీతాలను ఇచ్చి, మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు, యూనిఫామ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15వ వార్షిక ఆర్థిక సంఘం నిధులలో గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగార్జున్, మునీంద్ర పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో...

వరదయ్యపాళెం: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు అంబాకం చిన్నిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు నిరసన వ్యక్తం చేశారు.

గ్రీన్ అంబాసిడర్లకు రక్త పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్షలు చేశారు.

వెల కట్టలేనివి ఉపాధ్యాయుల సేవలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్థానికులు

నారాయణవనం: ఉపాధ్యాయుల సేవలకు విలువ కట్టలేమని పలువురు పేర్కొన్నారు. సోమవారం మండలంలోన్ని కీళగరం దళితవాడ ప్రాథమిక పాఠ శాల హెచ్ఎం అనితను స్థానికులు ఘనంగా సన్మానించారు. బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డును అనిత అందుకున్నారు. అవార్డును అందుకున్న అనిత గ్రామంలో విద్యార్థుల డ్రాపవుట్స్‌ను తగ్గించి, విద్యార్థులకు క్రమ శిక్షణ అలవరచారని స్థానికులు పేర్కొన్నారు. శాలువా కప్పి సన్మానించిన వారిలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు షణ్ముగం, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఊరప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

కూలీలు సంఖ్యను పెంచాలి



ఏపీఓతో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉందని, పెంచాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఏపీఓ భానుప్రియను ఆదేశించారు. మండలంలో 2 వేల మంది కూలీ లు పనిచేయాల్సి ఉండగా 800 మంది కూలీలు మాత్ర మే పనిచేస్తున్నారని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్‌పై చర్యలు తప్ప వని హెచ్చరించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక కూలీలు ఇబ్బంది పడుతున్నారని, అందరికీ అవగాహన కల్పించి, కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. పనుల వద్ద సౌకర్యాలను కల్పించాలన్నారు.

పరిహారం చెల్లించాలి

రేణిగుంట: అంతర్జాతీయ విమానాశ్రయం రన్వే కోసం భూముల కోల్పోయి ఎనిమిది సంవత్సరాలైనా ఇంత వరకు నష్ట పరిహారం అందలేదని రైతు వెంకటసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన పేద రైతు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ తన రెండు ఎకరాల వ్యవసాయ భూమి నుంచి 63 సెంట్లు భూమిని రెవెన్యూ శాఖ అధికారులు 2012లో విమానాశ్రయం రన్‌వే కోసం స్వాధీనం చేసుకున్నారన్నారు. రన్‌వే విస్తరణకు 63 సెంట్ల భూమి ఇచ్చినా తనకు ఇప్పటి వరకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించలేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయం

శ్రీకాళహస్తి: చైల్డ్ పోర్నోగ్రఫీపై ఇటీవల మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చడం, పోక్సో చట్ట ప్రకారం నేరమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షనీయమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పిల్లల హక్కులు, వారి అభివృద్ధి కోసం పనిచేస్తున్న సంస్థలు, కార్యకర్తలకు ఈ తీర్పు ఊరటనిచ్చిందన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బీఎస్ గిరికుమార్

శ్రీకాళహస్తి: మున్సిపల్ కమిషనర్ బీఎస్ గిరికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ రమేష్‌బాబు బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి కమిషనర్ విధులు నిర్వహిస్తుండేవారు. అయితే సోమవారం బీఎస్ గిరి కుమార్‌ను కమిషనర్‌గా నియమించింది. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. అదే విధంగా శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్‌గా బాలాజీ, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్‌గా సుధాకర్‌ను ప్రభుత్వం నియమించింది.

నేడు సర్వసభ్య సమావేశం

సత్యవేడు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారు లు హాజరు కావాలని ఆయన కోరారు.

ముక్కంటి నెయ్యిలో సైతం కల్తీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వాడే నెయ్యిలో సైతం కల్తీ ఉందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి ఆలయంలో తనిఖీ చేశారు. స్టోర్‌లోని పప్పులు, నెయ్యి తదితర వస్తువులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వాడిన నెయ్యిలో సైతం కల్తీ ఉందని ఆరోపించారు. శ్రీవారి లడ్డూలో మాదిరిగా పంది, చేప కొవ్వు వాడారంటూ ఇది క్షమించరాని తప్పు అంటూ తీవ్రవ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత అసలైన వైష్ణవి నెయ్యిని తెప్పిస్తున్నానని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన నెయ్యి, ఫలసరుకులపై సమగ్ర విచారణ చేయిస్తామన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నేతలు



పెద్దిరెడ్డితో పిచ్చాటూరు వైఎస్ఆర్ సీపీ నాయకులు

నాగలాపురం: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్ఆర్ సీపీ సత్యవే డు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్, పిచ్చాటూరు సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తిరుపతిలోని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తెలియపరిచారు. నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ నాయకులు పెద్దిరెడ్డితో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు హరిచంద్రారెడ్డి, సరంచ్ రోసిరెడ్డి, ఎంపీటీసీ శేష, వేలు, నాయకులు రాజ, ఆర్ ఎస్.రాజు, మునిరాజ్, భూపతి, సురేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి హరి



చెత్తబుట్టను అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఏర్పేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి హరి అన్నారు. సోమవారం మండలంలోని పాపానాయుడుపేటలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. పాపానాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నది పక్కన కోళ్ల వ్యర్థాలను విచ్చలవిడిగా వేస్తున్నట్లు వివరించారు. అలాగే గ్రామస్తులు చెత్తాచెదారాలు రోడ్డుపై వేయరాదన్నారు. భవిష్యత్తులో పాపానాయుడుపేటలోని కోళ్ల వ్యాపారస్తులు వ్యర్థాలను స్వర్ణముఖి నది పక్కన వేస్తే వారికి నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నారాయణవనం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా అడ్డుకట్ట వేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి షణ్ముగం పిలుపునిచ్చారు. నారాయణవనం మేజర్ పంచాయతీలో చెత్తను సేకరించడానికి ఇంటికి ఒక చెత్త బుట్టను సోమవారం నుండి పంపిణీ చేశారు. షణ్ముగం మీడియాతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను సేకరించడానికి రెండేసి బుట్టలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఆరు వేల బుట్టలు రావాల్సి ఉండగా 3 వేల బుట్టలు పంచాయతీకి చేరాయని అన్నారు. ప్రతి ఇంటికీ అందివ్వాలన్న లక్ష్యంతో ఒక్కో బుట్టను అందజేశామని అన్నారు. చెత్తను ఇళ్ల పరిసరాలలో, వీధుల్లో కాకుండా చెత్త బుట్టల్లో సేకరించాలని సూచించారు. ప్రతి రోజు వీధిలో వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు చెత్తను అందజేసి పారిశుధ్యానికి సహకరించాలని షణ్ముగం కోరారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీరెడ్డి

ఏర్పేడు: బ్యూటీషియన్ ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు బ్యూటీషియన్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యూటీషియన్ శిక్షణ 80 రోజుల్లో రోజుకు మూడు గంటలపాటు శిక్షణ జరుగుతోందన్నారు. సమాజంలో ప్రచ్ఛన్న నిరుద్యోగం తగ్గించడానికి చేతివృత్తులు సహకరిస్తాయని సూచించారు. శిక్షణానంతరం రాస్ ద్వారా సంఘాలకు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మత్తు బానిసల పునరావాస కేంద్రం డైరెక్టర్ అన్నాదొరై, ప్రోగ్రాం అధికారి హరిబాబు, పాపానాయుడుపేట కోటక్ బ్యాంకు మేనేజరు సుమలత, రాస్ ప్రతినిధులు వెంకటకుమార్, మునీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సంతవేలూరులో రెండు బోర్లు ఏర్పాటు



సంతవేలూరులో తాగునీటి బోరు వేయిస్తున్న సీసీఎల్ పరిశ్రమ యాజమాన్యం

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గ్రామ పంచాయతీ ప్రజల దాహార్తికి సమీపంలోని సీసీఎల్ కాఫీ పరిశ్రమ చేయూతనిచ్చింది. గ్రామంలోని గిరిజనకాలనీ, దళితవాడలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను పరిశ్రమ యాజమాన్యానికి విన్నవించడంతో పరిశ్రమ యాజమాన్యం స్పందించింది. దీంతో సోమవారం దళితవాడకు, గిరిజనకాలనీకి 2 బోర్లను సీఎస్ఆర్ నిధుల ద్వారా మంజూరు చేసి బోర్లు వేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ.. సంతవేలూరు ప్రజల దాహార్తికి సీసీఎల్ పరిశ్రమ యాజమాన్యం చొరవ అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీసీఎల్ పరిశ్రమ పీఆర్వో కిషోర్ కుమార్, స్థానిక పంచాయతీ సర్పంచ్ నందయ్య, పంచాయతీ కార్యదర్శి అబీబ్, ఆయకట్టు మాజీ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును సోమవారం తహసీల్దారు సుబ్రమణ్యం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుండి ఇసుకను అక్రమంగా తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ పనులు, ఇంటి అవసరాలకోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని, రీచ్‌లు ఉన్న చోట నుండి ఇసుకను తోలుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అందని వైద్య సేవలు



ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ: పీజీ వైద్య విద్యలో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ వైద్యులు చేపట్టిన ఆందోళనతో పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలు అందడం లేదు. సోమవారం 71 మంది రోగులు వివిధ రోగాలతో ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు లేక పోవడంతో ఎఎన్ఎంలు వైద్య సేవలు అందించారు. దీంతో రోగులు రోగులు ఇబ్బంది పడ్డారు. గత పది రోజులుగా ఇన్ సర్వీసు కోటాను కుదించడంతో పీజీ వైద్య విద్యలో అన్యాయం జరుగుతోందని, వెంటనే ఇన్ సర్వీసు కోటా కుదింపు జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్‌తో వైద్యులు ఆందోళన చేస్తూ విధులను బహిష్కరించారు. దీంతో గత పదిరోజులుగా ప్రభుత్వాపసుత్రిలో రోగులకు సక్రమమైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కట్టుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వైద్యుల డిమాండ్‌లను పరిష్కరించి, రోగులకు వైద్యం అందేలా చూడాలని రోగులు కోరుతున్నారు.



వైద్యం కోసం వచ్చిన రోగులు



రోగికి వైద్యం చేస్తున్న ఏఎన్ఎం